కాకినాడ సాగరతీరంలో...

టైగర్ ట్రంప్ విన్యాసాలు ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంప్ విన్యాసాలు మంగళవారం కాకినాడ సాగరతీరంలో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంపీబియాస్ విన్యాసాల్లో భాగంగా నేవెల్ ఎన్క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు బలగాలు చేరుకున్నాయి. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్రమార్గంలో త్రివిధ దళాలు జరిపే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధనౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విమానాలతో ఇరుదేశాల త్రివిధ దళాలు ఇప్పటికే సూర్యారావుపేట బీచ్‌కు చేరుకున్నాయి. అమెరికాకు చెందిన 2 యుద్ధ నౌకలు, భారత్‌కు చెందిన యుద్ధ నౌకలు ఇప్పటికే కాకినాడ సముద్ర ప్రాదేశిక డీప్ సీలో ఉన్నాయి. హోవర్ క్రాఫ్టులు, సహాయ కార్యక్రమాలకు వినియోగించే పలు వాహనాలు, యుద్ధ ట్యాంకర్లు, యుద్ధ నౌకలు డీప్ సీలు ఉన్నాయి. ఆర్మీ సిబ్బంది సముద్ర తీరంలో ప్రత్యేక రక్షణ గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. టైగర్ ట్రంప్ యాంపీబియాస్ విన్యాసాలు మంగళవారం నుంచి ఈనెల 13 వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఇరుదేశాల త్రివిధ దళాల సేనలు బుధవారం నుంచి సముద్రం, ఆకాశంలో విన్యాసాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విన్యాసాలు జరిగేప్రాంతంలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత బందోబస్తును పర్యవేక్షించారు.


విన్యాసాల్లో పాల్గొన్న ఇండో-అమెరికన్ సైనికులు

బీచ్ రోడ్డులో రాకపోకల నిషేధం

కాకినాడ సాగరతీరంలో సైనిక విన్యాసాల నిర్వహణ కోసం వాకలపూడి లైట్‌హౌస్ నుంచి ఉప్పాడ వరకు బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. తిమ్మాపురం పోలీస్ స్టేషన్, యు.కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో బీచ్‌రోడ్డును నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. బీచ్‌రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని, ఆంక్షలు ఈనెల 13 వరకు కొనసాగుతాయన్నారు.

విశ్వావసునామ సంవత్సరంలో..

నేటి నుంచి వివాహాది శుభ కార్యక్రమాల సందడి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరంలో సీతారాముల కల్యాణం పూర్తయిన తర్వాత వరుసగా వివాహాది శుభ కార్యక్రమాలకు చాలా ముహూర్తాలు ఉన్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని బండారులంకకు చెందిన ఈశ్వర గంటల పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు. జూన్ నెలలో గురుమౌఢ్యమితోపాటు జూలై 24 వరకు ఆషాడమాసం కావడంతో ముహూర్తాలు ఉండవన్నారు. శ్రావణ మాసంలో తిరిగి శుభముహూర్తాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈనెల 9 నుంచి వివాహాది శుభ ముహూర్తాలు వరుసగా ఉన్నాయని చెప్పారు. ఈనెల 27 వరకు చైత్ర మాసం. ఈ మాసంలో శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. కానీ ఈ నెలలో 9, 11, 15, 18, 22, 23, 24 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇక గృహ ప్రవేశాలు ఈనెల 11, 12, 13, 15, 16, 20, 21, 22, 23, 24 తేదీల్లోను, అక్షరాభ్యాసానికి 9, 11, 13, 16, 18, 21, 23, 24 తేదీలు అనుకూలం. ఇక ఈనెల 28 నుంచి మే 27వ తేదీ వరకు వైశాఖ మాసం. ఈ మాసంలో వివాహ ముహూర్తాలు చూస్తే ఏప్రిల్ 29, 30 తేదీలతోపాటు మే1, 7, 8, 9, 11, 14, 15, 16, 17, 21, 22 తేదీలు అనుకూలం. శంకుస్థాపనలకు ఈనెల 29, 30, మే 1, 3, 4, 8, 9 తేదీలు అనుకూలం. మే 11 నుంచి 28 వరకు వాస్తు కర్తరి కావడంతో శంకుస్థాపనలకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు ఉండవు. అయితే గృహప్రవేశాలకు ఈనెల 29, 30 తేదీలు, మే 1, 3, 4, 7, 8, 10 తేదీలు మాత్రమే అనుకూలం. అక్షరాభ్యాసానికి ఈనెల 30, మే 1, 3, 4, 8, 9, 11, 14, 16, 21 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.

జ్యేష్ఠ మాసంలో అంతంతమాత్రంగానే : భీమేశ్వరరావు సిద్ధాంతి

మే 28 నుంచి జూన్ 25వ తేదీ వరకు జ్యేష్ఠ మాసం. ఈ మాసం శంకుస్థాపనలకు శ్రేష్ఠం కాదు. ఇక వివాహ ముహూర్తాలు జూన్ 5, 7, 8 తేదీలు, గృహప్రవేశాలు మే 30, 31, జూన్ 6 తేదీలు. అక్షరాభ్యాసానికి మే 31, జూన్ 2, 5, 6, 7, 8 తేదీలు అనుకూలం. జూన్ 10 నుంచి జూలై 9వ తేదీ వరకు గురుమౌఢ్యమి. జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కావడంతో వివాహాది శుభ ముహూర్తాలు ఉండవు. జూలై 26 నుంచి శ్రావణమాసంలో తిరిగి శుభ ముహూర్తాలు ఉన్నాయి.

కోనసీమ తిరుమల కళకళలాడింది.. దేవదేవుడు తిరువీధుల్లో తిరుగాడాడు.. భక్తజనానికి కనుల విందు చేశాడు.. స్వామిని వేడుకునేందుకు వేలాదిగా భక్తజనం పోటెత్తారు.. స్వామిని కనులారా చూసేందుకు పోటీపడ్డారు.. గోవిందా..గోవింద అంటూ గొంతెత్తి స్వామిని పిలిచారు.. కొలిచారు.. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తజనం దర్శించుకుని తరించారు.. వాడపల్లి వెంకన్న తీర్థ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి రథోత్సవం, దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్రతువును భక్తజనం కనులారా వీక్షించి పులకించిపోయారు.


రథోత్సవం..


కల్యాణ మహోత్సవంలో తలంబ్రాల దృశ్యం

భక్తజన వాడపల్లి

అంగరంగ వైభవంగా దేవదేవుడి కల్యాణం

- బ్రహ్మాండంగా కోనేటి రాయుని రథోత్సవం
- తిరువీధుల్లో మెరిసిన దేవదేవుడు
- ప్రారంభించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు
- పులకించిన భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కల్యాణోత్సవాలను తిలకించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ప్రధాన హోమాలు, నిత్యబలిహరణతో కార్యక్రమాలను ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తోపాటు అధికార యంత్రాంగం, కూటమి శ్రేణులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవమూర్తులను ఆలయం ఎదురుగా ఉన్న ఎదుర్కోలు మండపం వద్దకు తొడ్కొని వెళ్లి వేదపండితులు, అర్చకులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారు తిరువీధులలో విహరించారు.

రథోత్సవానికి తరలివచ్చిన భక్తజనం...

స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు రథంపై స్నపనమూర్తులు వేదమంత్రాల సాక్షిగా అలంకృతలయ్యారు. ఎమ్మెల్యే బండారు రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజన గోవిందనామస్మరణతో స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరువీధుల్లో డ్రోన్లతో రథోత్సవంపై పూలవర్షం కురిపించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతోపాటు అధికార యంత్రాంగం కల్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. 200 మంది పోలీస్ సిబ్బంది ఏర్పాట్లలో వివిధ ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు, అన్నదానం వంటి కార్యక్రమాలు దేవస్థానం, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేశారు.


కల్యాణ వేదిక వద్దకు స్వామివార్లు


రథోత్సవంలో భక్తజనం

కల్యాణం.. కమనీయం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాలతో శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సుగంధ పరిమళాలు వెదజల్లే వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించిన కల్యాణ వద్ద స్వామి అమ్మవార్లు ఆశీనులయ్యారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం ఖండవిల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి దివ్యకల్యాణ క్రతువును నిర్వహించారు. సుముహూర్త వేళ కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల తంతును వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణ నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, జేసీ నిషాంతి, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు-కనకదుర్గాదేవి దంపతులు, ఆర్డీవో శ్రీకర్ దంపతులు, డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు, దేవదాయ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణ స్వామివారికి సమర్పించారు. స్వామివారి కల్యాణ తంతు జరుగుతుండగా వందల కిలోల హరతికర్పూరంతో జ్యోతిని వెలిగించారు. మిరిమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు, విద్యుత్ వెలుగుల నడుమ నిర్వహించిన స్వామివారి కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ బోణం సాయి బాబా, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, కూటమి నేతలు, భక్తులు పాల్గొన్నారు.


వేడుకలో అతిథులు

డొంకరాయి నుంచి గోదావరి డెల్టాకు..

నీటి విడుదల నిలిపివేత

సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు

సీలేరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను మంగళవారం నుంచి నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ జీఎం వాసుదేవరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతోపాటు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే 4,300 క్యూసెక్కులు సరిపోకపోవడంతో డొంకరాయి నుంచి అదనపు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ నేపథ్యంలో డొంకరాయి నుంచి ఫిబ్రవరి 10 నుంచి నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి ఒకటి నుంచి 4వేల క్యూసెక్కుల చొప్పున, మార్చి 21 నుంచి 5వేల క్యూసెక్కుల చొప్పున విద్యుత్ ఉత్పత్తి లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదల చేసినట్టు సీఈ తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 7 రాత్రి వరకు 15 టీఎంసీఈల నీటిని అందించినట్టు తెలిపారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలోని ఆంధ్రా వాటా నీటితో కలిసి డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో మొత్తంగా 48 నుంచి 50 టీఎంసీల వరకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. మండు వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని సీలేరు, డొంక రాయి, పొల్లూరు, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాల్లో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపడుతున్నట్టు వాసుదేవరావు పేర్కొన్నారు.

బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటులేదు

● అలాంటి వారిని అధిష్ఠానం ఉపేక్షించదు ● ఎమ్మెల్సీ సోము అభినందన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో గ్రూపులు, పైరవీలకు చోటు ఉండదని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అలాంటి వారిని పార్టీ అధిష్ఠానం ఉపేక్షించదనే విషయాన్ని నాయకులు, కార్యకర్తలు గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో బీజేపీ ఎమ్మెల్సీగా రెండో సారి ఎన్నికైన సోము వీర్రాజుకు అభినందన సత్కారసభ నిర్వహించారు. ఈ సభకు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సోము వీర్రాజు లేకపోతే తాను లేనన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఏఐఎస్ఎఫ్‌లో ఉన్న తనను బీజేపీలోకి తీసుకొచ్చింది వీర్రాజేనని, పార్టీలో 30 ఏళ్లుగా కష్టపడి పనిచేయబట్టే ఈ రోజు కేంద్ర మంత్రి పదవి దక్కిందన్నారు. పార్టీ కోసం మనం పడిన కష్టమే గుర్తింపు, పదవులు తెచ్చిపెడుతుందని, సోము వీర్రాజుకు రెండోసారి ఎమ్మెల్సీ పదవి దక్కడం అందుకు ఉదాహరణ అన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వీర్రాజు 40 ఏళ్ల క్రితం ఏ పార్టీలో చేరారో అదే రాజకీయపార్టీలో కొనసాగడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు. శ్రీనివాస వర్మ, దుర్గేష్‌లు వీర్రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.


సోమును అభినందిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు

త్వరలో తమిళనాడు, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం : సోము

తమిళనాడులో త్వరలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, తర్వాత తెలంగాణాలోనూ తమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు జోస్యం పలికారు. ఎప్పుడు ఏం చేయాలో బీజేపీకి ఒక వ్యూహం ఉంటుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రతి నెలా వేల కోట్లు అప్పులు ఇప్పించేవాళ్లం. అంతే చేశాం. పోలవరానికి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు, రైల్వేజోన్ వంటివి ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సీఎం అయ్యాక డబుల్ ఇంజన్ సర్కార్ రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రంలోని రొయ్యల రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, కేంద్ర మంతి శ్రీనివాసవర్మ కృషి చేస్తారన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో బీజేపీ ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, బీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ యువమోర్చా నాయకుడు నాగిరెడ్డి దుర్గామహేష్, పాకా సత్యనారాయణ, కంబాల శ్రీనివాసరావు, భద్రం మాట్లాడారు. రాష్ట్ర నాయకులు నిర్మల, ముళ్లపూడి రేణుక, రేలంగి శ్రీదేవి, అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు. కాపు సంఘం నాయకులు, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు సోము వీర్రాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండు సెంటర్ నుంచి సభా వేదిక వరకూ నిర్వహించిన భారీ ర్యాలీలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు


మంత్రి కందుల దుర్గేష్

సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పద మృతి

మృతురాలి బంధువులను పరామర్శించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగిని అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన నెల్లి కరుణ(25) నిడదవోలు 9వ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. రోజూలాగే సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చర్చికి వెళ్లినట్టు తల్లి నెల్లి సూర్యకుమారి తెలిపింది. చర్చి నుంచి వచ్చిన తరువాత కడుపునొప్పి వచ్చి అస్వస్థతకు గురైందని, నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడ నుంచి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందినట్టు ధ్రువీకరించారని చెప్పింది. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చేయగా ఎస్ఐ వీరబాబు మృతదేహాన్ని పరిశీలించి మంగళవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మృతురాలి కుటుంబీకులను మంత్రి దుర్గేష్ పరామర్శించారు. కరుణ మృతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు.


మృతిచెందిన నెల్లి కరుణ

తల్లిని చూసేందుకు వెళ్తుండగా...

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఆత్రేయపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిని చూసేందుకు వెళ్తున్న వ్యక్తిని ఇసుక లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామానికి చెందిన కడలి గోవిందు (44) వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం తన తల్లిని చూడడానికి మట్లదొడ్డి గ్రామానికి వెళ్తుండగా డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం మావుళ్లగుడి సమీపంలో రావులపాలెం నుంచి ఆత్రేయపురం వస్తున్న ఇసుక లారీ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై గోవిందును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.


మృతిచెందిన గోవిందు

సభకు విచ్చేయండి

యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానంపై రేపు పుస్తకావిష్కరణ

కార్యక్రమానికి రావాల్సిందిగా అతిథులకు టీడీపీ నేతల ఆహ్వానాలు

తుని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యనమల 42 వసంతాల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణ సభకు రావాల్సిందిగా అతిథులకు తుని నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు ఆహ్వానం పలికారు. యనమల రామకృష్ణుడు రాజకీయ జీవితంపై ప్రచురించిన ఈ పుస్తకాన్ని ఈనెల 10న కాకినాడ జిల్లా తునిలో ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేయనున్నారు. ఈ సభకు హాజరుకావాల్సిందిగా అతిథులను టీడీపీ నేత యనమల రాజేష్ స్వయంగా ఆహ్వానపత్రాలు అందజేసి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే కొందరికి వీటిని అందజేశారు. మంగళవారం ఆయన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు నవీన్, సీనియర్ నేత పిల్లి సత్యనారాయణమూర్తి ఆహ్వానపత్రాలు అందజేశారు. సభ విజయవంతానికి టీడీపీ, జనసేన శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

గోదావరి జలాల కాలుష్యంపై

డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అధ్యయనం


ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సామర్లకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ జలాల కాలుష్యంపై అధ్యయనం చేసేందుకు కేంద్రీయ హైడ్రాలజీ ఇనిస్టిట్యూట్ డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం అంగీకరించింది. 'ఆ మూడింటికీ నీటి ఎద్దడి తప్పదా' పేరిట ఆంధ్ర జ్యోతిలో ఈ నెల 6న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో జిల్లా ఉన్నతాధి కారులు స్పందించి తక్షణం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డెల్టాయిక్ ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ఎస్వీ విజయకుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం లేఖ పంపారు. శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా కాలుష్య మూల కాలు, కలుషితాలను గుర్తించేందుకు తూర్పు డెల్టా కాలువలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు తగిన రీతిలో నివేదికలు రూపొం దించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, ఇరిగేషన్, వ్యవసాయ, పురపాలక, ఏపీ రాష్ట్ర లీడ్ కార్పొరేషన్ వంటి శాఖల అధికారుల సమన్వయం ఎంతో అవసరమని హైడ్రాలజిస్ట్ విజయకుమార్ కమిషనర్‌కు రాసిన ఆ లేఖలో తెలిపారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో

అన్నవరం దేవస్థానానికి రెండో స్థానం

అన్నవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది. మొదటి నెల సర్వేలో చివరిస్థానంలో ఉండడంతో కాకినాడ జిల్లా కలెక్టర్ అన్నవరం ఆలయంపై ప్రత్యేక దృష్టిసారించి ఈవో వీర్ల సుబ్బారావుకు సూచనలు చేయడం వాటిని ఆయన అమలుపరుస్తూ రెండో నెల సర్వేలో రెండో స్థానానికి చేరుకుంది. మూడో నెల సర్వే వివరాలు మంగళవారం వెల్లడించారు. వీటిలో శ్రీకాళహస్తి దేవస్థానం మొదటిస్థానంలో ఉండగా చివరి స్థానంలో సింహాచలం చేరింది. ఇదిలాఉండగా భక్తుల తమ అభిప్రాయాల సేకరణకు చేపట్టిన క్యూఆర్ కోడ్ స్కానర్‌కు సంబంధించి అన్నవరం దేవస్థానానికి విచ్చేసిన భక్తులు ఎక్కువగా స్కాన్ చేయడం విశేషం. మొత్తం 6682 మంది భక్తులు ఈ నెలలో స్కాన్‌చేయగా ఐవీఆర్ఎస్ కాల్స్‌లో 3284 మంది స్పందించి వివరాలు తెలియజేశారు. దర్శనం సంతృప్తిగా జరిగినట్టు 93శాతం తెలుపగా, మౌలిక వసతులు బాగున్నట్టు 86శాతం మంది అభిప్రాయం తెలిపారు. 94శాతం మంది అన్నవరం ప్రసాదం రుచిగా ఉందన్నారు. దేవాలయంలో పారిశుధ్య నిర్వహణ బాగుందని 93శాతం మంది ఐవీఆర్ఎస్ సర్వేలో తెలియజేశారు. తదుపరి సర్వేలో మొదటిస్థానం చేరుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. సిబ్బందిని సమన్వయం చేయడంతో ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు.


పండిత సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

రామాలయంలో పండిత సదస్యం

సీతారాముల దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా అన్నవరం దేవస్థానం క్షేత్రపాలకులైన రామాలయంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులుగావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన పండితులు తమ పాండిత్యాన్ని నవదంపతుల ముందు వినిపించారు. పండితులకు విసినకర్ర, మదురఫలాలు, నగదు పారితోషకం అందించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు ఉన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు, శ్రీనివాసరావు దంపతులు



వంటింట్లో.. గ్యాస్ మంట!

- సిలిండర్ ధర రూ.50 పెంపు
- వినియోగదారులపై అదనపు భారం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ సిలిండర్ ధర చమురు కంపెనీలు ఒక్కసారిగా రూ.50 పెంచాయి. అమాంతం పెరిగిన ఈ ధరతో సామాన్యులు బెంబేలెత్తు తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 17లక్షల97వేల గ్యాస్‌కనెక్షన్లు ఉన్నాయి. ఒక గ్యాస్ సిలిండర్‌పై రూ.50 ధరను పెంచడంతో వినియోగదారులు రూ.8కోట్ల98లక్షలవరకు అదనంగా చెల్లించాల్సి ఉంది. దీనిలో కాకినాడ జిల్లాలో 6లక్షల92వేల కనెక్షన్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5లక్షల30వేల గ్యాస్‌కనెక్షన్లు, తూర్పుగోదావరి జిల్లాలో 5లక్షల70వేల వరకు కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.831 ఉండగా మంగళవారంనుంచి రూ.881 పెట్టి వినియోగదారులు కొనుగోలు చేశారు. పెరిగిన ధరలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఉజ్వల పథకంలో ఒక సిలిండర్ ధర రూ.503 ఉండగా అది కాస్తా రూ.553కు ధర పెరిగింది. పెరిగిన ధరలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భక్తజనుల వాడా..

భక్తజనులవాడా.. వాడపల్లి వేంకటేశ్వరుడా అంటూ భక్తులు మొక్కారు.. కనులారా దర్శించుకుని.. మనసారా వేడుకున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉదయం రథోత్సవం సాగింది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని కనులారా దర్శించుకుని ఏడుకొండలవాడా వెంకన్నా అంటూ కొలిచారు.. సాయంత్రం కల్యాణ క్రతువు వేడుకగా సాగింది. ప్రత్యేక అలంకరణలో స్వామి తమ చెంతకే రావడంతో కన్నులారా చూసిన భక్తజనం పులకించిపోయారు.. తన్మయత్వంతో ఊగిపోయారు. - వివరాలు 6లో

ఇక డిపాజిటర్లకు.. జయమే!



కాకినాడ జిల్లా సర్వవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

'జయ'ం జరిగేలా సర్కారు అడుగులు

- జయలక్ష్మి బాధితులకు అండ
- సీఎం దృష్టికి తీసుకువెళ్లిన కలెక్టర్
- సీఐడీతో ప్రభుత్వం సంప్రదింపులు
- రూ.450 కోట్ల ఆస్తుల వేలం
- 11న సీఎం చెంతకు పాలకవర్గం
- జూన్‌కల్లా కొంత చెల్లించే యత్నం
- గడువు విధించిన అధికారులు
- మూడేళ్ల కిందట ఘటన
- రూ.582 కోట్లకు శఠగోపం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు..రెండు కాదు.. ఏకంగా రూ.582 కోట్ల కుంభకోణం..జరిగి మూడేళ్లయినా ఇప్పటికీ బాధితులకు న్యాయం దక్కలేదు.. గత వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసేసి బాధితులకు తీరని అన్యాయం చేసింది.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలబడేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. సీఐడీ సీజ్‌చేసిన రూ.450 కోట్ల సొసైటీ ఆస్తులను ఎలాగైనా వేలం వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వేలం ప్రక్రియకు వేగంగా అడుగులు పడుతున్నాయి. తొలివిడత రూ.200 కోట్లయినా చేతికి అందితే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అటు సొసైటీ పాలకవర్గం సైతం ఈ నెల 11న సీఎం చంద్రబాబును కలవడానికి సన్నాహాలు చేస్తోంది. బాధితులకు న్యాయం చేయాలని సీఎంను కోరనుంది. జూన్‌లోపు బాధితులకు 25 శాతమైనా నగదు చెల్లించాలని ప్రయత్నాలు చేస్తోంది.

ప్రభుత్వం మారడంతో చకచకా..

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు వేగం గా అడుగులు పడుతున్నాయి. ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సీఎం చంద్రబాబుతో చర్చించారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న రూ.450 కోట్ల స్థిరాస్తులను వేలం వేసేలా చర్యలు చేపడితే బాధితులకు న్యాయం జరుగుతుందని వివరించారు. తొలుత సీఐడీతో ప్రభుత్వం చర్చించి వేలం ప్రక్రియ ముందుకు సాగేలా ప్రస్తుతం చర్యలు చేపట్టింది. వేలానికి అన్నీ అనుకూలిస్తే నెల వ్యవధిలో ప్రక్రియ ముగించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. వైస్ చైర్మన్ విశాలాక్షి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ రూ.60 కోట్లతో లండన్ చెక్కేయడంతో సీఐడీ ఇప్పటికే లుక్ అవుట్ నోటీసు..తాజాగా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేశారు.హైదరాబాద్‌లో నిందితుడికి చెందిన రూ.150 కోట్ల విలువైన 14 స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేసింది. లోన్లు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

రూ.582 కుంభకోణానికి మూడేళ్లు

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేది. మూడేళ్ల కిందట ఈ సంస్థ డిపాజిటర్లను మోసం చేసింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 20 వేల మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించి 2022 ఏప్రిల్ 6న బోర్డు తిప్పేసింది. బాధితుల ఆందోళనలతో ప్రభుత్వం విచారణకు ఆదేశించగా రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసం జరిగినట్టు జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు 348 పేజీల నివేదికను 2023లో అప్పటి ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రధారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్‌చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, ఇతర డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సీఐడీ విచారణ తర్వాత కుంభకోణంలో 159 మంది పాత్ర ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచింది. 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు అటాచ్ చేసింది. ఈ ఆస్తులపై సేల్ ఆర్డర్ కోసం ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో నడుస్తోంది. నూతన పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఇది వరకే సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.6 కోట్లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇంకో రూ.6 కోట్లు సీఐడీ సీజ్ చేసిన దాంట్లో కోర్టులో పెండింగ్‌లో ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు ఈ ఆస్తులపై కన్నేసి కొట్టేశారు.

త్వరలో మరిన్ని జీవోలు..

కుంభకోణానికి సంబంధించి 21,895 మంది డిపాజిట్‌దారులకు 2022 నాటికి వడ్డీతో కలిపి మొత్తం రూ.511 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు ఇప్పటికే లెక్కలు తేల్చారు. ప్రధానంగా రూ.లక్ష లోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా, రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య డిపాజిట్‌దారులు 2,384 మంది ఉండగా వీరికి రూ.37.83 కోట్లు, రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల లోపు 677 మంది బాధితులు ఉండగా వీరికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన బాధితులు 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్షి ఒక్కరే ఎటువంటి పూచీకత్తు లేకుండా బినామీలతో రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం. ఇప్పటి వరకు 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల స్థిరాస్తులను సీఐడీ సీజ్ చేయగా ఈ ఆస్తుల స్వాధీనానికి ప్రభుత్వం 12 జీవోలు జారీ చేసింది.మరో ఐదు జీ వోలు విడుదల చేయాల్సి ఉండగా మరో వారంలో రూ.100 కోట్ల ఆస్తుల సీజ్ కోసం రెండు జీవోలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది.

ప్రత్యేక ఆర్డినెన్స్ అవసరం

కూటమి ప్రభుత్వంలో జయలక్ష్మి సొసైటీ బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో జయలక్ష్మి వ్యవహారంపై సీఎం చర్చించడం మంచి పరిణామం. ఇప్పటికే కలెక్టర్ ద్వారా సహకారశాఖ కమిషనర్, సీఐడీ ద్వారా సీఎంకు లెటర్లు పంపాం. సొసైటీ సమగ్ర నివేదిక, సీజ్ చేసిన ఆస్తులు, తదితర వివరాలన్నీ కలిపి సొసైటీ పాలకవర్గం సభ్యులతో ఈనెల 11న సీఎం చంద్రబాబును కలవబోతున్నాం. సొసైటీ బాధ్యతలు తీసుకున్న సమయంలో ఒక్క రూపాయికి కూడా లేని స్థితినుంచి రూ.500 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు, స్వాధీనం చేసుకోవడంలో పోలీసు, సీఐడీకి సహకరించాం.బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకువస్తే సేల్ ఆర్డర్స్ వేగంగా వచ్చే అవకాశం ఉంది.

- గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్, జయలక్ష్మి సొసైటీ

పోలవరం.. పరుగు



- చకచకా సాగుతున్న పనులు
- ఇప్పటి వరకూ 55.9 శాతం
- ఒక పక్క డయాఫ్రం వాల్
- మరో పక్క ఈసీఆర్ఎఫ్ డ్యామ్
- 2027 డిసెంబర్‌కి ప్రాజెక్టు
- రెండేళ్లలో పూర్తిచేయడం లక్ష్యం
- సీఎం చంద్రబాబు రాకతో వేగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. డయాఫ్రంవాల్ నిర్మాణానికి సన్నాహ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 18న డయాఫ్రం వాల్ పనులు ఆరంభించారు. మొత్తం 1396.6 మీటర్ల మేర ఈ వాల్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 158.2 మీటర్ల మేర నిర్మించారు.ఇంకా సుమారు 1238 మీటర్ల వాల్ నిర్మించాల్సి ఉంది.ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీకి దీనిని పూర్తి చేసి 2026 జనవరి1కి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి నిర్ణయించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. డయా ఫ్రం వాల్ మీదనే అసలు డ్యామ్ అయిన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి ఉండకుండా దానికి సమాంతరంగా ఇరువైపులా ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ నిర్మాణ పనులు చేయడానికి నిర్ణయించారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1ను పూర్తి చేసే పనిలో అధికారులు, యంత్రాలు నిమగ్నమయ్యాయి. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్వయంగా ప్రాజెక్టు పరిశీలించి అధికారులకు సూచనలు చేయడంతో పనులు వేగవంతం అయ్యాయి.2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

పనులు జరిగిన తీరిది..

ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం పనులు 55.90 శాతం జరిగాయి.సివిల్ వర్క్సు 78.56 శాతం, హెడ్ వర్క్సు పనులు 76.43 శాతం,కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసి) పనులు 92.75 శాతం, ఎడమ ప్రధాన కాలువ(ఎల్ఎంసి) పనులు 74.43 శాతం, భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు 25.11 శాతం జరిగాయి.వైసీపీలో చతికిలపడిన ప్రాజెక్టును కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టింది.2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ సుమారు 7 శాతం పనులు జరిగాయి.

ఇదీ యాక్షన్ ప్లాన్

పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్సుకు సంబంధించి అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ -1 పనులు 2024 డిసెంబర్ 10న ప్రారంభించారు.2026 మార్చి 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. డయాఫ్రంవాల్ పనులు ఈ ఏడాది జనవరి 18న ఆరంభించారు.ఈ ఏడాది డిసెంబర్ 31కి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 పనులు ఇంకా మొదలుకాలేదు. ఇవి త్వరలో మొదలు పెట్టి 2027 డిసెంబర్ 27కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇవి పూర్తయితే ప్రాజెక్టు పూర్తయినట్టే. కుడి వైపు అనుబంధ పనులు వచ్చే ఏడాది జూలై 31కి పూర్తి చేయడంతో పాటు ఎడమ వైపు అనుబంధ పనులు 2027 ఫిబ్రవరి 28కి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు.ఇక భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, కాలనీల నిర్మాణం, కుటుంబాల తరలింపు పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. మరో పక్క పవర్ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి.స్పిల్‌వే పూర్తి కావడంతో ఇప్పటికే గోదావరి నీటిని స్పిల్‌వే గుండా ధవళేశ్వరం బ్యారేజీ వైపు వదిలేస్తున్న సంగతి తెలిసిందే.



జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతగా నిలిచిన కెప్టెన్‌కు షీల్డు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆటవిడుపుగా క్రీడా పోటీలు అభినందనీయం

జిల్లా స్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల డ్రీమ్2కే-25 క్రీడా పోటీలు

క్రీడా విజేతలకు షీల్డులు అందజేసిన జిల్లా కలెక్టర్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆటవిడుపుగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిత్యం ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొనే ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయిలో డ్రీమ్ 2కే-25 క్రీడా పోటీలు నిర్వహించారు. మహిళా, పురుష విభాగాల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలను నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవ సభ నడిపూడి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత కలెక్టరేట్‌లో క్రీడా విజేతలకు కలెక్టర్ మహేష్‌కుమార్ షీల్డులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందడంతోపాటు క్రీడా ప్రతిభను చాటాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆయన సూచించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు శ్రమించిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబును పలువురు అభినందించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సహాయ ఇంజనీర్లుగా పదోన్నతి పొందడానికి డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ తరపున కృషిచేస్తానని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంబాబు అన్నారు. పీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీఎస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల స్పోర్ట్స్ మీట్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి క్రీడాపోటీలను నిర్వహించిన, ప్రోత్సహించిన ప్రతీ ఒక్కరు అభినందనీయులన్నారు. ఈ పోటీల్లో క్రికెట్ విన్నర్స్‌గా నిలిచిన కొత్తపేట జట్టును కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.రాము, సీపీవో పి.వెంకటేశ్వర్లు, గృహనిర్మాణ సంస్థ ఈఈ ఎంవీ నరసింహారావు, డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిశోర్, వివిధ శాఖల ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. పోటీల్లో 400 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు జిల్లా కోఆర్డినేటర్ కాలే సురేష్, జి.గౌతమ్‌రాజు, కె.ధర్మాజీ తెలిపారు.

నూరు శాతం సంతృప్తి చెందేలా పరిష్కరించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులు నూరుశాతం సంతృప్తి చెందేలా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ దరఖాస్తుల పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రీసర్వేలో అందిన ఫిర్యాదులు, రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, 22ఏ భూముల తొలగింపు, పీజీఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్, నీటితీరువా తదితర అంశాలపై తొలుత రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రధానకార్యదర్శి జి.జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార విధానంపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టి ప్రజా సంతృప్తి స్థాయిలను అంచనా వేస్తూ జిల్లాల వారీగా గ్రేడింగ్‌లు ఇస్తున్నట్టు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రెవెన్యూ చట్టాలపై తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహనతో క్షేత్ర స్థాయిలో పనిచేసి భూసమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రికార్డుల తయారీలో రెవెన్యూ, ల్యాండ్ విభాగం, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేసి అందరి వద్ద ఒకేవిధమైన రికార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేలో రైతులకు సందేహాలుంటే నివృత్తి చేయాలన్నారు. అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరనుందన్నారు. డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. భూ రెగ్యులరైజేషన్ స్కీమ్-2015 పేరిట భూములను క్రమబద్ధీకరణ చేస్తూ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేయాలన్నారు. ప్రస్తుత వరి సాగులో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవో కె.మాధవి, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డీటీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడ ఫ్లైవోవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

ఇటీవల నిలిచిపోయిన జొన్నాడ ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సృష్టి కాంట్రాక్టు ప్రైవేటు లిమిటెడ్ గుత్తేదారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, గుత్తేదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రిటైనింగ్ వాల్, గడ్డర్లు, సర్వీసు రోడ్లు, అప్రోచ్ రోడ్లు, మడికి, చొప్పెల్ల, చెముడులంక వద్ద సర్వీసు రోడ్ల నిర్మాణంపై సమీక్షించారు. పాశర్లపూడి-మామిడికుదురు బైపాస్ రోడ్డు పనులపైనా సమీక్షించారు. ఎన్‌హెచ్ అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకుడు సురేంద్రనాథ్, సహాయ ఇంజనీర్ వెంకటరమణ, గుత్తేదారు రామకృష్ణ, సెక్షన్ సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.



జాబ్‌మేళా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

12న అమలాపురంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే జాబ్‌మేళాను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభిస్తారు. 12 కంపెనీలకు చెందిన మానవ వనరుల రీసోర్స్‌పర్సన్ల ద్వారా నిరుద్యోగుల అర్హత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. తద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని హరిశేషు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్‌మేళా గోడపత్రికలను కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, రాజేంద్ర పాల్గొన్నారు.



అల్పపీడనంతో తీరంలో అలజడి

అల్లవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం వల్ల సముద్ర తీరం వెంబడి ఈదురు గాలులలతో అలల ఉధృతి పెరిగింది. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం, సముద్రతీరం వెంబడి అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి అలల కారణంగా తీరభూమి భారీగా కోతకు గురవుతోంది. వరిచేలు దాళ్వా కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో వాతావరణ మార్పుల వల్ల రైతులు భయపడుతున్నారు.



అమలాపురంలోని మహిపాల వీధిలో మంగళవారం వెంకన్న రథోత్సవం వైభవంగా జరిగిన దృశ్యం..

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు

అటల్ ల్యాబ్స్ దోహదం

● రాష్ట్ర సమన్వయ అధికారి వెంకటేష్



పేరూరు జడ్పీ పాఠశాలలో అటల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర సమన్వయ అధికారి వెంకటేష్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక ఆలోచనలను వెలికి తీసేందుకు అటల్ ల్యాబ్స్ దోహదపడతాయని రాష్ట్ర సమన్వయ అధికారి పి.వెంకటేష్ పేర్కొన్నారు. పేరూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అటల్ ల్యాబ్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషాతో కలిసి వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక ఆలోచనలను మరింత అభివృద్ధి పరిచేందుకు అటల్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాల అటల్ ల్యాబ్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. దీని పరిధిలో 5 అటల్ స్పోక్స్ స్కూల్స్, 41 జనరల్ అటల్ ల్యాబ్ స్కూల్స్ పనిచేస్తున్నాయన్నారు. ల్యాబ్ నిర్వహణ, వాటి పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. అటల్ ల్యాబ్స్‌లో ఉండే పరికరాలను ఆయన నిశితంగా పరిశీలించి భద్రత, సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ల్యాబ్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠ్యాంశాల్లోని అంశాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకునేలా అటల్ ల్యాబ్ కార్యక్రమాలు ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా మాట్లాడుతూ త్వరలో 26 పీఎంశ్రీ స్కూల్స్‌లో అటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అటల్ ల్యాబ్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం ప్రతీనెలా సంబంధిత నివేదికను జిల్లా కేంద్ర కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి రాంబాబు, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు.

పోలీసుల నివేదికను అధిష్టానానికి పంపిస్తాం

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలంలో జనసేన నాయకుల మధ్య చోటుచేసుకున్న విభేదాలపై పోలీసులు, జనసేన శ్రేణులు అందించిన సమాచారాన్ని పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించి పార్టీ అధిష్టానానికి పంపిస్తామని మంగళవారం ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో అందించిన నివేదిక ఆధారంగా పార్టీ తీసుకున్న నిర్ణయాలను అనుసరించి సంబంధిత నాయకులపై చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు. పార్టీలో క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడే వ్యక్తులకు నానుంచి ఎటువంటి సహకారం ఉండదన్నారు. పార్టీ నుంచి నిర్ణయం వచ్చేలోపు మండలంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఐదుగురు సభ్యులతో కూడిన అడహాక్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా నాగభూషణం, నలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, గుర్రాల రమాదేవి, కుప్పాల ఈశ్వరి సభ్యులుగా ఉంటారని చెప్పారు. జనసేన క్యాంపు కార్యాలయం నుంచి వచ్చే సమాచారాన్ని ఈ కమిటీలు ద్వారా జనసైని కులకు అందిస్తామన్నారు. అప్పటి వరకు అయినవిల్లి మండలంలోని జనసైనికులు ఎటువంటి అపోహలకు లోనుకాకుండా పవన్ కళ్యాణ్ లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు.

సబ్‌డివిజన్ పరిధిలో 16 పవర్ టిల్లర్లు మంజూరు

పి.గన్నవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలో మూడు మండలాలకుగాను 16 పవర్ టిల్లర్లు మంజూరైనట్లు ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు తెలిపారు. అంబాజీపేట మండలానికి-6, మామిడి కుదురు మండలానికి-4, పి.గన్నవరం మండలానికి-6 మంజూరైనట్లు ఆయన వివరించారు. పవర్‌టిల్లర్ ధర రూ.2,29,500లు అని దానిలో రూ.లక్షరూపాయాలు సబ్సిడీగా ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే పవర్ టిల్లర్‌కు ఈ-క్రాప్ బుక్కింగ్ చేసుకున్న ఐదు ఎకరాలలోపు రైతు అర్హుడని ఆయన తెలిపారు. బుధవారం పి.గన్నవరంలో లబ్ధిదారులైన రైతులకు పవర్‌టిల్లర్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందించనున్నట్లు ఆయన వివరించారు.

పెండింగ్ సమస్యలపై సీఎంతో సమీక్ష

యానాం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): యానాం పెండింగ్ అంశాలపై పుదుచ్చేరి సీఎం రంగసామి నేతృత్వంలో సమీక్షాసమావేశం నిర్వహించినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈమేరకు వివరాలను మీడియా ప్రతినిధులకు వివరించారు. గత రెండు రోజులుగా యానాం అంశాలపై పుదుచ్చేరి గవర్నర్, సీఎం, వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చించారు. యానాంలో డంపింగ్‌యార్డు సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యానాంలో ఉన్న హెచ్‌ఆర్ సంస్థ యానాంలో ఉన్న చెత్తను అనుకున్న విధంగా శుభ్రంచేయకుండా ప్రభుత్వం నుంచి అధికమొత్తంలో నగదు తీసుకున్నారు. యానాంలో ప్రస్తుతం ఈ సమస్యను పరిష్కరించేందుకు రెండు ఎకరాలు ప్రైవేటు స్థలంను కేటాయించేందుకు అంగీకరించారు. అతిత్వరలో శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించిన స్థలాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిలో రెండు ప్రభుత్వ స్థలాలతోపాటు రీజెన్సీ పరిశ్రమకు సంబంధించి మూతపడిన ఇంజనీరింగ్ కళాశాలలో కొంత భూమిని కేటాయించాలని సీఎంను కోరామన్నారు. దీన్ని పరిశీలించేందుకు పుదుచ్చేరి నుంచి ఉన్నతాధికారులు యానాం పర్యటనకు వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. అదేవిధంగా కోర్టులకు తప్పుడు సమాచారం ఇస్తూ నడుపుతున్న పేకాట కేంద్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్‌ఆర్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతాలు పెంపు, ఉద్యోగభద్రతతో పాటు యానాంలోని ఆరోగ్యశాఖ, విద్యా, తదితరశాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ జీతాలు అంశాలపై చర్చించారు.

అలరించిన అన్నమయ్య స్వరార్చన

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని శ్రీవెంకటేశ్వరస్వామి సనాతన హిందూ ధర్మ ప్రచార రథసారధి, వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం సంకీర్తనాచారి కరుటూరి వెంకటశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గొల్లవిల్లి శ్రీరామ నవమి ఉత్సవ వేదికపై సోమవారంరాత్రి జరిగిన తాళ్ళపాక అన్నమాచార్య స్వరార్చనలో ఆయన పాల్గొన్నారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరుడిని కీర్తిస్తూ అన్నమయ్య ఆలపించిన గీతాలను శ్రీనివాసరావు తన గాన మాధుర్యంతో పాడి శ్రోతలను ఆధ్యాత్మిక నందనవనంలో విహరింపజేశారు. ఇదే వేదికపై భైరవబొట్ల రాజేశ్వరి అన్నమయ్య గీతాలాపన చేశారు. అన్నమయ్య స్వరార్చన చేసిన కరుటూరి వెంకటశ్రీనివాసరావు, ఆయనకు సహకరించిన వాద్య బృందాన్ని గ్రామస్థులు సత్కరించారు.

గడువు కోరిన రవ్వ యాజమాన్యం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం సమగ్రాభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి కల్పన అంశాలపై గతంలో ఇచ్చిన హామీలను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం గ్రామస్తులు రవ్వ ప్లాంటు వద్ద ధర్నా చేశారు. గేట్లు మూసివేసి ఉద్యోగులను ప్లాంటులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. వేదాంత పర్యవేక్షణాధికారి సతీష్‌రెడ్డి ఆందోళనకారులతో చర్చించారు. కలెక్టర్, ఆర్డీవోలతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ఈనెల 25న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు గ్రామస్తులు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పలచోళ్ళ పద్మనాభం, లంకే భీమరాజు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి'

అంబాజీపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం న్యాయమైన విచారణ చేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ చికిలే ధనరాజు కోరారు. అంబాజీపేట బెరాక మందిరంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ మండలాధ్యక్షుడు సీహెచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ జ్ఞాపకార్థ కూడిక నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యు.ప్రశాంత్‌కుమార్, కె.మనోహర్, గాడా ఇసాక్, కుసుమ రత్నం, వై.విజయకుమార్, అబ్రహం పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు

యానాం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో అక్రమంగా నీటిచౌర్యంకు చర్యలు తప్పవని యానాం మత్స్యశాఖ సహాయ సంచాలకులు ప్రకటనలో తెలిపారు. యానాంలో ఉన్న రొయ్యలు, చేపల చెరువులు నిర్వహిస్తున్న రైతులు చెరువుల నిర్వహణ అవసరాలకు యానాం ప్రజల మంచినీటి సరఫరా కాల్వలో నీటిని వాడుకుంటున్నారని తెలిసింది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2020, కోస్టల్ అక్వాకల్చర్ అథారిటీ చట్టం 2005 ఉల్లంఘనగా పరిగణించి తగినచర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. దీనిని ఆక్వా రైతులందరూ గమనించాలన్నారు.

రౌడీషీటరు అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సహవాసం చేస్తున్న మహిళతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతున్న ఓలేటి ఓంప్రకాష్‌పై ఇటీవల అమలాపురం నల్లవంతెన వద్ద దాడిచేసిన రౌడీషీటర్ కంచిపల్లి శ్రీనును మంగళవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

వైభవంగా వేంకటేశుడి రథోత్సవం

● ప్రారంభించిన ఎంపీ హరీష్‌మాధుర్

● గోవింద నామస్మరణతో మార్మోగిన పట్టణం



అమలాపురంలో వేంకటేశుని రథోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురంటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భక్తుల గోవింద నామస్మరణల నడుమ అమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మహిపాలవీధిలో ఉన్న శ్రీఅలివేలుమంగతాయారు, బీబీనాంచారీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంవద్ద తీర్థం నిర్వహించారు. మధ్యాహ్నం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ స్వామివారిని దర్శించుకోగా తొలుత ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, బోనం సత్యవరప్రసాద్, ఆశెట్టి ఆదిబాబు, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్వామి-అమ్మవార్లను రథంపై ఉంచారు. రథం తాడును స్వయంగా ఎంపీ హరీష్‌మాధుర్ లాగారు. కేరళ వాయిద్యాలు, గారడీలు, భాజాభజంత్రీలు నడుమ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్నల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రథయాత్రలో ఉత్సవ కమిటీ సభ్యులు దున్నాల వెంకటస్వామినాయుడు, గన్నవరపు సూర్యభాస్కరరావు, గోకరకొండ లక్ష్మణరావు, మోకా వెంకటసుబ్బారావు, దున్నాల దుర్గారావు, కొమ్మూల ఆదినారాయణ, కుంచే వెంకన్నబాబు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి ఆలయం వద్ద తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన దంగేటి చిట్టిబాబు, ప్రభాకరరావు, రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తీర్థం

పి.గన్నవరం: లంకల గన్నవరంలో ఉన్న శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవంలో మంగళవారం తీర్థమహోత్సవం వైభవంగా జరిగింది. సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఆలయ ప్రధానఅర్చకులు నారాయణాచార్యులు, మారుతీ ఆచార్యులు బ్రహ్మత్వాన స్వామి వారికి ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల కోసం గ్రామస్తులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలో ఉన్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారంరాత్రి ఘనంగా జరిగింది. కల్యాణోత్సవాలు పెద్దింటి మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు పలు పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 12వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కమిటీవారు తెలిపారు.

రాజోలు: రాజోలు సుందరమ్మ చెరువుగట్టువద్ద ఉన్న భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వేద పండితుడు ఎ.శ్రీనివాసాచార్యులచే మంగళవారం వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి-అమ్మవార్లకు మేళతాళాల మధ్య గరుడవాహన సేవను జరిపారు. పితాని భాస్కర సత్యనారాయణమూర్తి-సూర్యకళ దంపతులచే శ్రీస్వామివారి కల్యాణాన్ని జరిపించారు. స్వామివారికి జడ్ల రామకృష్ణపరమహంస-దేవి దంపతులు, దార్ల పాపయ్యాచారి-కనకదుర్గ దంపతులు, చెల్లింగి లక్ష్మీశ్వరి-త్రిమూర్తులు దంపతులు, లక్కవరానికి చెందిన మంగెనవారి కుటుంబసభ్యులు, మొల్లేటి నాగరాజు-బిందు మాధవి దంపతులు నూతన వస్త్రాలు బహూకరించారని ఆలయ ఈవో ఎస్వీఎస్ఎస్వీ ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, కాట్నా రాజు, ఎంపీటీసీలు దార్ల కుమారిలక్ష్మి, కొపనాతి పుష్పలత, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, ఉపసర్పంచ్ పామర్తి రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

చురుగ్గా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం



ఉపాధ్యాయులకు కూల్ డ్రింకులు అందిస్తున్న డీఈవో సలీంబాషా, ఎస్టీయూ నాయకులు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ చురుగ్గా జరుగుతున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. ఎస్టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మూల్యాంకనంలో విధులు నిర్వర్తిస్తున్న 1500 మంది ఉపాధ్యాయులకు మంగళవారం కూల్‌డ్రింకులు అందజేశారు. కూల్ డ్రింకు బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని క్యాంపు ఆఫీసర్, డీఈవో సలీంబాషా ప్రారంభించారు. స్పాట్ వాల్యూయేషన్ జరుగుతున్న ప్రతీ తరగతి గదిలోకి ఎస్టీయూ నాయకులు స్వయంగా వెళ్లి ఉపాధ్యాయులకు మండుటెండలో కూల్ డ్రింకులు అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ బోనం గంగాధర్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ బండారు నారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, ఎంటీఎస్ రాష్ట్ర నాయకుడు చొల్లంగి కేశవకుమార్, నిమ్మన సత్యనారాయణ, జనిపల్లి భీమారావు పాల్గొన్నారు.

మూల్యాంకన స్పెషలిస్టులకు టీఏ, డీఏలు చెల్లించాలి

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో సుదూర ప్రాంతాల నుంచి స్పెషలిస్టులుగా నియమించిన వారికి ఎటువంటి టీఏ, డీఏలు చెల్లించడంలేదని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాకనం కేంద్రం వద్దకు వచ్చిన గోపీరాజును కలుసుకుని తమ గోడును వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర ఎగ్జామినేషన్ డిపార్టుమెంట్ల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని గోపీరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి బొంతు వీవీఎస్ఎన్‌మూర్తి, అధ్యక్షుడు చెల్లింగి ప్రసాద్, అమలాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్వీ రమణారావు, తోట రవి, గన్నవరం, రాజోలు, అయినవిల్లి జోన్‌ల ప్రతినిధులు పాయసం శ్రీనివాస్, ముత్యాల కిశోర్, చొప్పల చంద్రశేఖర్, తోరం బాలాజీ ఈశ్వరరావు, టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బెల్టుషాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు

అల్లవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అల్లవరం మండలం గూడాలకు చెందిన ముగ్గురు బెల్టు షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గూడాలకు చెందిన బొంతు వెంకటరెడ్డి, కొమ్ముల వీరబాబు, అద్దంకి సతీష్ అనే ముగ్గురు బెల్టుషాపు పాత నిర్వాహకులపై బైండోవర్‌చేసి అల్లవరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు. అల్లవరం మేజిస్ట్రేట్, తహశీల్దార్ నరసింహం ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు పట్టణ ఎస్ఐ నరహరిశెట్టి రామకిశోర్‌బాబు తెలిపారు. అమలాపురం మోబర్లీపేటకు చెందిన గునిశెట్టి నాగబాబుతో సత్యవతి (27)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం తీసుకురావాలని నాగబాబు భార్యను తరచూ వేధిస్తుండడంతో సత్యవతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దళితులను విడదీసే కుట్రలో భాగంగానే కూటమి ప్రభుత్వం అన్యాయంగా వర్గీకరణ చేపట్టిందని మాలసంఘాల ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. మంగళవారంరాత్రి అమలాపురం మద్దాలవారిపేటలో మున్సిపల్ కౌన్సిలర్ నాగవరపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన మాలముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లోక్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఒకే షెడ్యూల్‌లో ఉన్న దళితులను విడదీసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. మాల సంఘాల నాయకులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, రేవు తిరుపతిరావు, బడుగు జేమ్స్‌పాల్, జల్లి శ్రీను,పెయ్యల శ్రీనివాసరావు, గొల్లపల్లి డేవిడ్, కప్పల శ్రీధర్, పినిపే జయరాజ్, గూటం సాయి, పినిపే శ్రీను, మాకే సిద్ధ, విప్పర్తి రమణ, గెడ్డం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్, ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

అంతర్వేది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి ముత్యాలమ్మ గుడి వద్ద ఎడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు ఆధ్వర్యంలో సురక్షిత మంచినీటి పథకం అడ్వాన్స్ ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంటును కిమ్స్ ఆసుపత్రి అధినేత కె.చైతన్యరాజు, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు మంగళవారం ప్రారంభించారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు 20 లీటర్ల వాటర్ టిన్ కేవలం రూ.5కే ఈ ఆర్వో ప్లాంటు వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం అమ్మవారిగుడి వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది సుమారు 400 మంది స్థానిక ప్రజలకు హెల్త్ చెకప్‌చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందుల చిట్టిబాబు, శ్రీనురాజు, పద్మరాజు పాల్గొన్నారు.

పోలీసులకు సీసీ కెమెరాల అందజేత



పోలీసులకు సీసీ కెమెరాలు అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం పట్టణ పోలీసులకు రూ.2 లక్షల విలువచేసే సీసీ కెమెరాలను స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో పట్టణ సీఐ పి.వీరబాబుకు డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్ సమక్షంలో అందజేశారు. 12 సీసీ కెమెరాలతో పాటు మూడు ఎన్వీఆర్ఎస్, 3 స్విచ్‌బోర్డు, 3 హార్డ్ డిస్కలను అందజేశారు. సీసీ కెమెరాలను స్థానిక గడియార స్తంభం సెంటర్, శుభకలశం సెంటర్, ముమ్మిడివరం గేట్ సెంటర్లలో ఏర్పాటు చేయనున్నట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు యెండూరి నాగబాబు, కుప్పాల రామకృష్ణ, ఆకే సూరిబాబు, తోట బాబ్జి,యర్రా సతీష్, అడబా బాబ్జి, అప్పలరాజు, సప్పా నాగేశ్వరరావు, తిరుమనాథం బుజ్జి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉగాది అవార్డు గ్రహీత కొల్లూరికి సత్కారం



ఉగాది పురస్కార గ్రహీత కొల్లూరిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని సీఎం చంద్రబాబు, సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి అందుకున్న డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరిని మంగళవారం ఘనంగా సత్కరించారు. తెలుగు సాహితీ రంగంలో కోనసీమ ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్న కొల్లూరిని పలువురు ప్రశంసించారు. అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నిమ్మకాయల నాని, యర్రంశెట్టి మూర్తి, అరిగెల చంద్రశేఖర్, అరిగెల బాబ్జి, ముత్యాల గంగాధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే గిడ్డి



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గతేడాది జూలై నెలలో వచ్చిన వరదల సమయంలో ఉడి మూడి ఏటిగట్టు నుంచి పడవపై లంకగ్రామాలకు వాటర్ ప్యాకెట్లు తీసుకువెళ్లే క్రమంలో జరిగిన బోటు ప్రమాదంలో చదలవాడ విజయకృష్ణ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఎమ్మెల్యే ఆకుటుంబానికి జీవ నాధారమైన యువకుడి మృతిపై కుటుంబ సభ్యుల ను పరామర్శించి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి తక్షణం అందించారు. అదే సమయంలో మృతుడు సోదరికి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. చదలవాడ కళ్యాణికి ఆర్డ బ్యూఎస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించారు. ఈమేరకు నియామక పత్రాన్ని పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కళ్యాణికి అందించారు.

క్రీడా విజేతలకు ఎంపీడీవో అభినందన

అల్లవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలానికి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో క్రికెట్, క్యారమ్స్ విభాగాల్లో విజేతలుగా నిలిచి రన్నర్స్ కప్ సాధించడం పట్ల ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ వారిని అభినందించారు. పట్టుదలతో క్రీడాస్ఫూర్తితో ఆడి మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నారు.

నేటి నుంచి రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కిరణ్ పర్యటన

అమలాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జె.కృష్ణకిరణ్ ఈనెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. క్షేత్రస్థాయిలో జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 అమలు తీరును ఆయన పరిశీలిస్తారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, చౌకధరల దుకాణాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హస్టళ్లను పరిశీలిస్తారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం అమలుతీరుపై వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 9వ తేదీ ఉదయం 9.30కు అమలాపురంలోని కలెక్టరేట్‌కు ఆయన చేరుకుంటారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి నాగాభరణం బహూకరణ



సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి నాగాభరణ అందజేస్తున్న దృశ్యం

అయినవిల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని వైజాగ్‌కు చెందిన తోట షణ్ముకేశ్వరసాయికృష్ణ-రమణమ్మ దంపతులు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించారు. శ్రీవిఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో అంతరాలయంగా ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి 1.570 కిలోల వెండి నాగాభరణాన్ని సాయికృష్ణ దంపతులు బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో దాతను సత్కరించారు.

స్వామివారికి వెండి పళ్లెం అందజేత

అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని కాట్రేనికోనకు చెందిన గ్రంధి శ్రీకృష్ణసుశాంత్ కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీవిఘ్నేశ్వరస్వామివారికి 511 గ్రాముల వెండి పళ్లాన్ని సుశాంత్ బహూకరించారు. దాతకు ఆలయ ప్రధాన అర్చకుల ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించి మొత్తం 54 యూనిట్లు మంజూరు కాగా బీసీ కార్పొరేషన్ యూనిట్లు 38, ఈబీసీ 4, కాపు కార్పొరేషన్ యూనిట్లు 12కు సంబంధించి 427 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా మంగళవారం వారికి బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవివర్మ, స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు, చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రుణాలకు పోటెత్తిన లబ్ధిదారులు

మామిడికుదురు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ రుణాల నిమిత్తం జరిగిన ఎంపికలకు లబ్ధిదారులు పోటెత్తారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంట్రీలు జరిగాయి. మండలంలో 1819 మంది దరఖాస్తు చేసుకోగా వారికి సోమ, మంగళవారాలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, కాపు, ఈడబ్ల్యుఎస్ తదితరులకు 102 మందికి సబ్సిడీ రుణాలు కేటాయించనున్నట్టు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

మోరిలో ప్రభుత్వ బడిబాట-బంగారుబాట

అంతర్వేది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం మోరి మోడల్ ప్రైమరీ స్కూలు, మహలక్ష్మమ్మగుడి సమీపంలో ప్రభుత్వ బడిబాట-బంగారుబాట కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థులను బడిలోచేర్చుకునే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడిబాట-బంగారుబాట ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విద్యార్థులకు అందించడమే ప్రభుత్వ బడుల లక్ష్యమని ఎంఈవో డి.కిశోర్‌కుమార్ తెలిపారు. ఎంఈవో-2 ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పనలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ఎంపీటీసీ లక్ష్మీసూర్యావతి, ఎస్ఎంసీ చైర్మన్ కానూరి సురేష్, హెచ్ఎం ఉండపల్లి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విజయదుర్గా పీఠంలో లోక కల్యాణార్థం యాగం



పీఠంలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం లోక కల్యాణార్థం యాగం నిర్వహించారు. పీఠాధిపతి గాడ్ సమక్షంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన శ్రీసాయి సత్సంగ నిలయం ఆధ్యాత్మికవేత్త కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గ అమ్మవారికి, నవగ్రహాలకు, 27 నక్షత్రాలకు హోమం చేశారు. అనంతరం గాడ్ కుమార్తెలు రమ, సత్యవెంకట కామేశ్వరి, సత్య కనకదుర్గ, గాడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పూర్ణాహుతి జరిపించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తుల నుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ భారతీయ వైదిక సంస్కృతిలో యజ్ఞ, యాగాదులకు ఎంతో విశిష్టత ఉందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, బుజ్జి, పీఆర్వో బాబి, సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి

రాయవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టే ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన సూచించారు. మంగళవారం రాయవరంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ మేట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. వేసవి దృష్ట్యా కూలీలు ఎండవేడి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రామచంద్రపురం క్లస్టర్ ఏపీడీ సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ పనులు జరిగే ప్రాంతంలో షామియానాలు, తాగునీరు అందుబాటులో ఉండాలన్నారు. పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.గంగాభవాని, సిబ్బంది పైడారావు, పీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కీర్తి స్పందన

సీపీఐ ప్రచారజాతా కపిలేశ్వరపురం రాక



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కామేశ్వరరావు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో సీపీఐ ప్రచార జాతా నిర్వహించారు. సీపీఐ ఏర్పడి వందేళ్ల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచారజాతాలో భాగంగా మంగళవారం కపిలేశ్వరపురం చేరుకుంది. ఈ జాతాకు సీపీఐ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు లంకే కామేశ్వరరావు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, గుత్తి నాగేశ్వరరావు తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో చిట్టూరి సత్యనారాయణ, నామాల విష్ణు, కొప్పిశెట్టి అన్నవరం తదితరులతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, ఏఐటీయుసీ సభ్యులు పాల్గొన్నారు.



వి.సావరంలో వరికోతలు నిర్వహిస్తున్న కూలీలు

మండలంలో వరికోతలు ప్రారంభం

రాయవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో వెదసాగు జరిపిన పొలాలు ఇటీవల కోత దశకు చేరుకున్నాయి. పంట చేతికి అందే సమయంలో వాతావరణ మార్పులతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో 12 గ్రామాల్లో సుమారు 14,650 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. నవంబరు 20 తరువాత వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు డిసెంబరు మొదటి, రెండో వారంలో వెదసాగు ద్వారా సాగు చేశారు. రాయవరం-వెదురుపాక రోడ్డును ఆనుకుని ఉన్న పొలాలతో పాటు వెదురుపాక-వి.సావరం శ్మశానవాటిక రోడ్డు సమీపంలో ఉన్న పొలాల్లో బొండాల రకం సాగు చేసిన పొలాలు ప్రస్తుతం కోతదశకు వచ్చాయి. దీంతో రైతులు యంత్రాలతో వరికోతలు జరుపుతున్నారు. పశువులకు ఎండిగడ్డి అవసరం ఉన్న రైతులు యంత్రాలతో కాకుండా కూలీలతో వరికోతలు జరుపుతున్నారు. మండలంలో వరికోతలు మరింత వేగవంతంగా పూర్తి చేసేలా రైతులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో దిగుబడి ఆశాజనకంగా ఉండాలని రైతులు కోరుకుంటున్నారు.

విద్యుత్ పొదుపుతో లాభాలెన్నో...

రావులపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులతో పాటు ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను చాలా పొదుపుగా వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబు సూచించారు. రావులపాలెంలోని కర్రి తాతారెడ్డి కాంప్లెక్స్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ మప్తే బీజిలీ ప్రయోజన పథకంలో ఏర్పాటు చేసిన కేవీఎల్ సోలార్ ఎనర్జీ కార్యాలయాన్ని మంగళవారం ఎస్ఈ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీని ఉయోగించుకుని గృహాలకు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



సోలార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజబాబు

జిల్లా అదనపు న్యాయమూర్తి సేవలు ప్రశంసనీయం



జిల్లా అదనపు జడ్జి శంకరరావును సత్కరిస్తున్న గోపాలరావు, నరసింహమూర్తి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా శంకరరావు అందించిన సేవలు ప్రశంసనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, కార్యదర్శి బొడ్డు వరహా నరసింహమూర్తి అన్నారు. చిత్తూరు పోక్సో కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన శంకరరావును బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. సీనియర్ న్యాయవాది మల్లిడి హరినాథరెడ్డి మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో బార్ అసోసియేషన్‌తో మంచి అనుబంధం ఏర్పడిందని జూనియర్ న్యాయవాదులు కూడా కేసులు వాదించగలిగారన్నారు. అనంతరం అమ్మిరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి, బార్ అసోసియేషన్ కార్యవర్గం, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీల్లో డిగ్రీ విద్యార్థి ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ విద్యార్థి ఇ.సత్యవర్ధన్ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఈనెల 5న వికసిత భారత్ అంశంపై విజయవాడలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో ప్రతిభ కనపరిచారు. దీంతో సత్యవర్ధన్‌కు ఆల్ ఇండియా యువ చిత్ర కళారత్న అవార్డు అందచేశారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, ఎకనామిక్స్ శాఖాధిపతి బి.రవికుమార్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా రవికుమార్ రూ.2 వేలు నగదు అందించారు.



విద్యార్థి సత్యవర్ధన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

సమస్యల మధ్యే పాఠశాలల ప్రయాణం

• ఉపాధ్యాయులు, విద్యార్థులకు తప్పని పాట్లు • పట్టించుకోని యంత్రాంగం



అద్దంకివారిలంక ప్రాథమిక పాఠశాల స్లాబ్ అంచున ఫేషియల్ అటెండెన్స్ వేస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లోని 4 పాఠశాలలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక్కడ మూడు ప్రాథమిక, ఒకటి ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అద్దంకివారిలంక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఫేషియల్ అటెండెన్స్ వేసేందుకు సెల్‌సిగ్నల్ రాకపోవడంతో పాఠశాల బిల్డింగ్‌పైకి వచ్చి హాజరు నమోదు చేసుకోవల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భయపడుతూనే ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ పాఠశాలలో 75 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు రెగ్యులర్ కాగా మరొకరు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. పల్లపులంక ప్రాథమిక పాఠశాలలో 24 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, మోతావారి ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, పెదపేట ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా ఇచ్చిన ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు పనుల్లో పాఠశాలలకు మంజూరైన సొమ్ములో కొంతవరకు పనులు జరగ్గా మిగిలిన పనులకు నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. వంట రూం షెడ్డు, బాత్‌రూం షెడ్లు పనులు పూర్తి కాక, వాటర్ ట్యాంకులు ఏర్పాటుకాక ఇబ్బంది పడుతున్నారు. బాత్‌రూం షెడ్లు పూర్తికాకపోవడం, వాటర్ ట్యాంకు లేకపోవడంతో బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు విద్యార్థులు బకెట్లతో నీరు పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పల్లపులంక పాఠశాల ఆవరణ లెవెలింగ్ చేయకపోవడం, కొంతవరకు ప్రహరీ నిర్మాణం జరగడంతో పాఠశాల ఆవరణలో నుంచే ప్రజలు తిరగడంతో ఇబ్బందిగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బాత్‌రూం డోర్స్ పూర్తి చేయకపోవడం, పెయింటింగ్ పనులు పూర్తి చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెదపేట పాఠశాల వద్ద పూర్తికాని టాయ్‌లెట్స్

విఘ్నేశ్వరునికి వెండి పళ్లెం బహూకరణ

అయినవిల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని కాట్రేనికోనకు చెందిన గ్రంధి శ్రీకృష్ణసుశాంత్ కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి 511 గ్రాముల వెండి పళ్లాన్ని బహూకరించారు. దాతకు ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనం అందజేసి సత్కరించారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా మూడవ రోజు మంగళవారం స్వామివారికి అర్చనలు, తులసిపూజ తదితర పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చన, సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అన్నమయ్య స్వర్ణాన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడా ప్రాంగణం ఆక్రమణపై అధికారుల చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని క్రికెట్ అకాడమీ పేరుతో కబ్జా చేస్తున్నారన్న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. డీఈవో సలీం బాషా, కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఆదేశాల మేరకు ఎంఈవో ఎం.హరిప్రసాద్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ బోర్డును మంగళవారం తొలగించారు. క్రీడా ప్రాంగణంలో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.



డ్రైయిన్ పూడికతీత పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రైతులకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆరోపించారు. రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. అవిడి గోరింకల డ్రైయిన్ పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంట కాలువల ఆధునికీకరణ, డ్రైయిన్‌లలో పూడికతీత వంటివి రైతులకు మేలు చేసే పనులు చేపట్టలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్, నక్కా వెంకటేశ్వరరావు, ఐరెడ్డి రామారావు, రెడ్డి చంటి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): టేకిలో 5న చెట్టుపై నుంచి జారిపడిన గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మెర్ల వీరరాఘవ (62) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అంగర పోలీసుల కథనం ప్రకారం.... గ్రామంలోని రామాలయానికి కట్టేందుకు మామిడాకుల కోసం పొలంలోని చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో బంధువులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనలపై మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వీరరాఘవ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

కర్ణాటక ఆలయాల్లో ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు



కర్ణాటకలోని శృంగేరి పీఠం దేవాలయాలను దర్శించుకున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గం నుంచి వరుసగా నాల్గోసారి విజయం సాధించిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కర్ణాటక రాష్ట్రంలోని పురాతన ఆలయాలను దర్శించుకుంటున్నారు. అర్తమూరుకు చెందిన తాడి శేషారెడ్డి ఆహ్వానం మేరకు కర్ణాటకకు వెళ్లిన ఆయన మిత్రులతో కలిసి ఆలయాలను దర్శించుకుంటున్నారు. మంగళవారం ఉడిపిలో వున్న శ్రీకృష్ణ దేవాలయం, శృంగేరి పీఠం, హరనాడులో వున్న అన్నపూర్ణేశ్వరి అమ్మవారి దర్శించుకుని పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వీరెడ్డి, రామన్న కాపు తదితరులు వున్నారు.



మండపేటలో మద్యం దుకాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మండపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) మండపేట సత్యశ్రీ రోడ్డులో సప్తగిరి థియేటర్ ఎదురుగా గీత కార్మికులకు మంజూరైన మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానికుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం 18వ రోజుకు చేరాయి. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించేది లేదని మూడు వార్డులకు చెందిన మహిళలు హెచ్చరిస్తూ ఆందోళన చేస్తున్నారు. మద్యం షాపు వల్ల అనేక సమస్యలు వస్తాయని వారంటున్నారు. నిరాహారదీక్షల్లో ఎం.సరస్వతి, దేవి, పిల్లి లక్ష్మి, సంతోష్, విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి వర్మకు ఘనస్వాగతం



కేంద్ర సహాయశాఖా మంత్రి శ్రీనివాసవర్మకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

రావులపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రోడ్డు మార్గంలో వెళుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు రావులపాలెంలో ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో టీఎస్ఎన్‌బీ ఫంక్షన్ హాలు వద్ద ఆయనతో పాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, బీజేపీ నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి, నాయకులు సాధనాల శ్రీను, పడాల బుల్లికొండారెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పీడీఎంఎస్ కిట్లు పంపిణీ

కె.గంగవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రసాయిన ఎరువులతో రెండు పంటలు పండించిన తరువాత భూమిని ఖాళీగా వదిలేయవద్దని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ ఏవీ రంగారావు అన్నారు. దీనివల్ల భూమిలోకి ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించిపోవడం ద్వారా భూసారం కోల్పోతామన్నారు. మంగళవారం కె.గంగవరంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజరు ఏ.శ్రీనివాసు మాట్లాడుతూ తొలకరి సీజన్‌కు సంబంధించి సన్నద్ధతపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా పీడీ ఎంఎస్ కిట్లు రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ మండల అధికారి బలుసు రవి మాట్లాడుతూ అపరాలు 50 శాతం రాయితీపై సిద్ధంగా ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అడిషనల్ డీపీఎం ఎంవీవీ శ్రీనివాసు, వీఏఏ మంజు ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పీడీఎంఎస్ కిట్లు అందజేస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ రంగారావు

రామచంద్రపురం, పామర్రులో రేపు మెగా జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ)/కె.గంగవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ చదువుకున్న నిరుద్యోగులకు 10న రామచంద్రపురం, పామర్రు గ్రామాల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కాకినాడ, విశాఖలో సుమారు 700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ ప్రాంతంలో పనిచేసే వారికి రూ.12,400 వరకు జీతం, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయంతో పాటు, ఉచిత భోజన సదుపాయం ఉంటుందన్నారు. విశాఖలో పనిచేసే వారికి రూ.15 వేల నుంచి 18 వేల వరకు జీతం, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సదుపాయం ఉంటుందన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు టెన్త్, ఇంటర్ పాసైన సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాసుపోర్టు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

గుండెపోటుతో ఇంజనీరింగ్ మండల అధికారి మృతి

రాయవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల ఇంజనీరింగ్ అధికారి కేవీవీ సత్యనారాయణ (58) మంగళవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల ఇంజనీరింగ్ మండల అధికారిగా పనిచేసిన రామనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో అమలాపురం పంచాయతీరాజ్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ గతనెల 29న రాయవరం ఇంజనీరింగ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. చీడిగలో ఉంటున్న ఆయన తెల్లవారుజామున గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు ఎంపీడీవో కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తహశీల్దారు ఐపీ శెట్టి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి తదితరులతో పాటు, పలువురు ఉద్యోగులు సంతాపం తెలిపారు.

'నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు మొండిచేయి'

మండపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వల్ల మైనార్టీలకు ఒరిగిందేమి లేదని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబు అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కనీసం మైనార్టీలకు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మండపేట వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా ముస్లింనేతలు పునరాలోచించుకోవాలని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మండపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకవ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....ద్వారపూడి పంచాయతీ బంగారమ్మకాలనీకి చెందిన కపిలేశ్వరపురపు వీర్రాజు(40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె వున్నారని స్థానికులు తెలిపారు. కుటుంబ గొడవలే ఆత్మహత్యకు కారణమని వారంటున్నారు. అనపర్తిలో వున్న ఐటీసీ కంపెనీలో పని చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల వీర్రాజు ఇంటిని నిర్మించుకున్నాడని, ఇంటికి సమీపంలో వున్న తల్లిదండ్రులు ఇంట్లో ఉరివేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. తల్లిదండ్రులు షిర్డీ వెళ్లగా, వారింట్లో వీర్రాజు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిన వెంటనే షిర్డీ నుంచి వారు బయలుదేరినట్టు స్థానికులన్నారు. వీర్రాజు ఆత్మహత్యతో కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, ఎస్ఐ బుజ్జిబాబు సంఘటన వివరాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నామని ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కొత్తపేటలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రాయవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం కళాశాలలో చదువుతున్న సుమారు 70 మంది విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, అధ్యాపకుడు డీవీవీ నాగేశ్వరరెడ్డి, విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను ఆలమూరులో మంగళవారం పంపిణీ చేశారు. ఆలమూరు జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ర్యాలీ సుబ్బలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థినీలకు అందించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈనెల 7నుంచి ఇంటర్ రెండో సంవత్సరం క్లాసు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సుకు కృషి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, పల్లి ఏసు, బీర ఇసాక్, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.